క్లుప్తంగా

ఘనంగా విగ్రహ ప్రతిష్ట



రామలయంలో ప్రతిష్టించిన విగ్రహాలు

మారేడుమిల్లి : మండలంలోని డి.వెలమలకోట గ్రామంలో సమర సత ఫౌండేషన్ పర్యవేక్షణలో తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ ఆర్థిక సాయంతో నిర్మించిన రామలయంలోని విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. అర్చకులు కృష్ణారెడ్డి, మోహన్‌రావు చేతుల మీదుగా ప్రతిష్ట, హోమం జరిగింది. పేదలకు రగ్గులు, దుప్పట్లు పంపిణీ చేశారు.శంకర్, హరి, సన్యాసిరెడ్డి, జగన్నాథ్, అప్పారావు, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలు పటిష్టంగా అమలుచేయాలి



మాట్లాడుతున్న నరేష్

చింతూరు: ఏజెన్సీలో భూమిహక్కు చట్టాన్ని రద్దు చేయాలని ఆదివాసీ జేఏసీ డివిజన్ అధ్యక్షుడు జల్లి నరేష్ అన్నారు. చింతూరులో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో 1/70, పీసా, అటవీ హక్కుల చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు.తమ్మయ్య, సాయివెంకటరమణ, దేశయ్య, వెంకట్, సుబ్బయ్య, గణేష్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య



విద్యార్థులతో పాఠం చదివిస్తున్న మండల పరిషత్ పాఠశాల కో–ఆర్డినేటర్ భాస్కరరావు

జి.మాడుగుల: మండలంలో గాంధీనగరం గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మండల పరిషత్ పాఠశాలల కోఆర్డినేటర్ కె.భాస్కరరావు శనివారం తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని ఆయన పరీక్షించారు. పలు పాఠ్యపుస్తకాలను విద్యార్థులతో చదివించారు. ఉపాధ్యాయులకు విద్యార్థులకు అందిస్తున్న విద్యాబోధనపై వాకబు చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను ఉపాధ్యాయులు అందించి ప్రయోజకులను చేయాలన్నారు. ఏఎస్‌వో జి సింహచలం,సీడబ్ల్యుఎస్ఎన్ రవిచంద్ర, హెచ్ఎం కేశవ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో డాక్ సేవలు



డాక్ సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ అనసూయ

కూనవరం: టేకులబోరులో ఏర్పాటు చేసిన డాక్ సేవా కేంద్రాన్ని శనివారం తహసీల్దార్ కె.అనసూయ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాతూ డాక్ సేవా కేంద్రం ద్వారా పోస్టల్ సేవలు త్వరితగతిన అందుతాయన్నారు. రిజిస్టర్ ఉత్తరాలు, పార్సిల్ బుకింగ్, బీమా, ఐపీబీపీ తదితర సేవలు పొందే అవకాశం ఉందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

26 నుంచి ఆడుదాం ఆంధ్రా పోటీలు

కొయ్యూరు/మారేడుమిల్లి/రాజవొమ్మంగి: కొయ్యూరు, మారేడుమిల్లి, రాజవొమ్మంగి ప్రాంతాల్లో శనివారం జరిగిన కార్యక్రమాల్లో ఎంపీడీవోలు లాలం సీతయ్య, వీరా కిషోర్, ఎల్.యాదగిరీశ్వరరావులు వేర్వేరుగా మాట్లాడుతూ అన్ని సచివాలయాల పరిధిలో ఈనెల 26 నుంచి ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్రా కార్య్రక్రమాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్ , షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనేందుకు ఇప్పటికే క్రీడాకారులు పోటీలు నమోదు చేసుకున్నారన్నారు. రాజవొమ్మంగిలో యోగా తరగతులను ప్రారంభించారు. ఎంఈవోలు తమ్మరావు, సూరయ్యరెడ్డి, పరిపాలనాధికారి జయంతి, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరిలో టీడబ్ల్యు బాలికల-2 పాఠశాల



కొత్తవలస గిరిజన సంక్షేమ బాలురు పాఠశాల



సర్కారు బడులకు మహర్దశ

అనంతగిరి: గతంలోని టీడీపీ ప్రభుత్వ హయాంలో విద్యావ్యవస్థ దారుణంగా ఉండేది. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు ఉండేవి కావు. శిథిల భవనాల్లో పాఠశాలలు ఉండేవి. చెట్ల నీడన తరగతులు జరిగేవి. వర్షం పడితే తరగతి గదులన్నీ జలమయ అయ్యేవి. పాఠశాలలకు సెలవు ప్రకటించేవారు.. పాఠశాలల్లో అనేక సమస్యల నడుమ విద్యార్థులు చదువులు సాగించేవారు...అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యా వ్యవస్థ పూర్తిగా మెరుగుపడింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు పెద్దపీట వేశారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా మార్చేందకు శ్రీకారం చుట్టారు. ఇందుకోసం నాడు–నేడు ద్వారా కోట్లాది రూపాయలను వెచ్చించారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. నాణ్యమైన బోధనతో ఆధునిక సదుపాయాలతో సర్కారు బడులు దర్శనమిస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. దీంతో బడుల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

నాడు- నేడు మొదటి విడతలో ఎంపికైన పాఠశాలలు: 40
మంజూరైన నిధులు: రూ.11.29 కోట్లు

నాడు- నేడు రెండో విడతలో ఎంపికైన పాఠశాలలు: 46
మంజూరైన నిధులు: రూ.10.39 కోట్లు

మెరుగైన సదుపాయాలు

ప్రభుత్వ పాఠశాలలను నేడు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నేడు వసతులను కల్పించారు.. నాడు-నేడులో మొదటి, రెండో విడతలో ప్రభుత్వ పాఠశాలల్లో 9 అంశాలకు సంబంధించి అభివృద్ధి చేశారు. ఆయా నిధులతో ఫ్యాన్లు, బెంచీలు, తాగునీరు, మరుగుదొడ్లు, గ్రీన్‌చాక్‌బోర్డులు, ఇంగ్లీషు ల్యాబ్స్, టైల్స్, ఇవి కాకుండా అదనపు భవనాలు, ప్రహరీ, విద్యార్థులను ఆకర్షించేలా రంగురంగుల చిత్రాలను వేయించారు. ఎంపీపీ, యూపీ, గురుకులం, కేజీబీవీ, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు నేడు సౌకర్యాలతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.. నిరుపేదలకు చదువు దూరం కాకూడదనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన తదితర పథకాలతో విద్యార్థులకు భవిష్యత్తుకు భరోసా కల్పిస్తున్నారు..

- అనంతగిరి గిరిజన సంక్షేమ బాలికొన్నత పాఠశాల-2లో నాడు-నేడు మొదటి విడతలో రూ.65లక్షలతో తరగతి గదులు, ఫర్నీచర్, ఎలక్ట్రికల్ పనులు, మరుగుదొడ్ల నిర్మాణ పనులు జరిగాయి.
- అనంతగిరి గిరిజన సంక్షేమ బాలికొన్నత పాఠశాల-1లో నాడు-నేడు మొదటి విడతలో సుమారు రూ.50లక్షలతో పలు అభివృద్ధి పనులు చేశారు.
- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు విడత నాడు-నేడు ద్వారా మంజూరైన రూ.60.77లక్షలతో మరుగుదొడ్లు, తాగునీరు, ఎలక్ట్రికల్ పనులు చేయించారు.
- గుమ్మకోట గురుకుల పాఠశాలలో నాడు-నేడు మొదటి విడతలో మంజూరే రూ.48లక్షల నిధులతో డైనింగ్ హాల్, కిచన్ హాల్, స్టోర్ రూమ్, మరుగుదొడ్లు, వాస్ బేషిన్ తదితర పనులు జరిగాయి.



లంగుపర్తి పాఠశాలలోని డిజిటల్ విధానంలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

మండలం: అనంతగిరి		
ఎంపీపీ పాఠశాలలు	:	153
యూపీ పాఠశాలలు	:	7
గిరిజన సంక్షేమ		
ఆశ్రమ పాఠశాలలు	:	12
గురుకుల పాఠశాల	:	1
కేజీబీవీ	:	1
విద్యార్థులు	:	9,543



శివలింగపురం గిరిజన సంక్షేమ బాలురు పాఠశాల



చెరుకుమడత ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులు

బాగా చదువుకుంటున్నాం



గతంలో మాపాఠశాలలోని సదుపాయలు ఉండేవి కాదు. నాడు నేడుతో మా పాఠశాల అభివృద్ధి చెందింది.. చాల సంతోషంగా ఉంది.. బాగా చదువుకుంటున్నాం.
– త్రివేణి, పదో తరగతి, బాలికల–2 పాఠశాల, అనంతగిరి

సీఎం సార్‌కు రుణపడి ఉంటాం



నాడు-నేడుతో మా పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దారు. అదనపు తరగతి భవనం నిర్మాణం, డైనింగ్‌హాలు నిర్మాణం చేపడుతున్నారు. మా భవిత్‌కు భరోసా కల్పించిన సీఎం సార్‌కు రుణపడి ఉంటాం.
– దివ్య, 9వ తరగతి, బాలికల–2 పాఠశాల, అనంతగిరి

నాడు- నేడుతో అభివృద్ధి

నాడు-నేడు మొదటి విడతలోని రూ.65 లక్షల నిధులు మంజూరు కావడంతో పాఠశాలలో పలు అభివృద్ధి పనులు చేపట్టాం. నాడు-నేడుతో పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు,నాణ్యమైన బోధనతో విద్యార్థులు ఎక్కువగా చేరుతున్నారు.
– మంగమ్మ, హెచ్‌ఎం, టీడబ్ల్యూ బాలికల–2 పాఠశాల, అనంతగిరి

ముగిసిన వైఎస్సార్ పొలంబడి

వై.రామవరం: మండలంలోని చవిటిదిబ్బలు గ్రామంలో మండల వ్యసాయ అధికారి ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 14 వారాలుగా నిర్వహిస్తున్న పొలంబడి కార్యక్రమంలో రైతులకు వ్యవసాయంలో పాటించాల్సిన సూత్రాలు, సేంద్రియ ఎరువుల వాడకం, ప్రయోజనాలు, అధిక దిగుబడి సాధించే విధానం, చీడపీడల నివారణ చర్యలు తదితర అంశాలపై పూర్తి అవగా హన కల్పించామన్నారు. అలాగే ఆరోగ్యవంతమైన పైరును పెంచుకోవడం, మిత్ర పురుగులను సంరక్షించుకోవడం, తెగుళ్ల సమస్యలను పరిష్కరించుకోవడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు. పర్యావరణానికి హాని కలగకుండా సస్యరక్షణ చర్యలు తీసుకుని అధిక దిగుబడి సాధించే విధానంపై రైతులకు పూర్తి అవగాహన కల్పించామన్నారు. సచివాలయాల అగ్రికల్చర్ అసిస్టెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ అధికారి ఉషారాణి, సిబ్బంది, ఆదర్శ రైతులు

సీసీ రోడ్లు పరిశీలన

ముంచంగిపుట్టు: మండలంలోని జర్రెల పంచాయతీ కేంద్రం నుంచి సున్నపుకోట గ్రామం మీదుగా మండిభ గ్రామం వరకు రెండు కిలోమీటర్లు జెడ్పీ నిధులు రూ.68లక్షలతో చేపట్టనున్న రోడ్డు పనులను సర్పంచ్ భాగ్యవతి శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మన్యంలో గిరిజన గ్రామాలకు మహర్దశ నెలకొందని ప్రతి గ్రామానికి రహదారి, సీసీ రోడ్డు సౌకర్యం కల్పించి రవాణా వ్యవస్థను మెరుగుపరచాలని ప్రభుత్వం కంకణం కట్టుకొందన్నారు. ఏళ్ల తరబడి అధ్వాన రహదారితో అవస్థలు పడ్డ గిరిజనులకు జెడ్పీ నిధులతో రహదారుల మంజూరుతో గిరిజనుల కష్టాలను తీరుతున్నాయన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే పాలన జగనన్న తీసుకు వచ్చారని ప్రజలు అన్ని విధాలా అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందన్నారు. నేతలు సురేష్, సుందరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్, వార్డు మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ భాగ్యవతి

క్రీస్తు బోధనలు అనుసరణీయం



పెదబయిల్ గ్రామంలోని వేడుకల్లో పాల్గొన్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



సీలేరులో సాంస్కృతిక కార్యక్రమంలో చిన్నారులు

అనంతగిరి/అరకులోయ రూరల్/సీలేరు: జిల్లాలో ఐక్య క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. చిన్నారులు శాంతాక్లాజ్ వేషధారణలో ఆకట్టుకున్నారు. ముందస్తుగా ఒకొరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతగిరి మండలంలోని లంగుపర్తి పంచాయతీ పెదబయల్ గ్రామంలోని బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ డానియేల్ ఆధ్వర్యంలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమన్నారు. క్రీస్తు సూచించినట్టు ప్రేమ, అప్యాయతో ప్రజలందరూ మెలగాలని, శాంతి, సహనాన్ని పాటించాలని ఆకాంక్షించారు. రవి తదితరులు పాల్గొన్నారు. అరకులోయ మండలంలోని కొత్తభల్లుగుడ పంచాయతీ సూకురుగుడలో చర్చిలో జరిగిన వేడుకలో పాస్టర్ సంజీవ్ కుమార్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు జీసు చరణ్, సుశాంత్, అబ్రహాం, దానుబాబు తదితరులు పాల్గొన్నారు. సీలేరులోని డీఏవి పాఠశాలలో జరిగిన వేడుకలో ఈఈ ప్రభాకరరావు, ఏఈఈ అప్పలనాయుడు, ఎల్.ఎంసి చైర్మన్ ఎస్ఈ ప్రశాంత్ కుమార్, హెచ్ఎం నమశ్శివాయ తదితరులు పాల్గొన్నారు.



ప్రార్థన చేస్తున్న పాస్టర్ సంజీవ్‌కుమార్

ప్రతి గడపలోనూ సంతోషం

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అనంతగిరి: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నేరవెర్చడంతో ప్రతి గడపలో సంతోషం నెలకొందని, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని లంగుపర్తి పంచాయతీలో శనివారం నేలపాలెం, మెట్టవలస, కుంబర్తి, రాయిపాడు, లంగుపర్తి గ్రామాల్లో గడప గడపకు మనప్రభుత్వం నిర్వహించి, 204 గడపలను సందర్శించారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే చెట్టి పాల్గుణకు గిరిజనులు పెద్ద ఎత్తున స్వాగతలు పలికారు. అమ్మ, అక్కా, చెల్లి, అన్న అంటూ గిరిజనుల అప్యాయంగా పలకరించి, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలపై ఆరా తీశారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ గిరిజన అభ్యున్నతే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా కృషి చేస్తున్నారన్నారు. శివారు గ్రామాలు కూడా నేడు అభివృద్ధికి బాటలు వేశాయని, విద్య, వైద్యం, తాగునీరు, రోడ్ల సదుపాయానికి పెద్ద ఎత్తున నిధులను విడుదల చేసి, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి నాంది పలికారన్నారు. లంగుపర్తి గ్రామంలోని అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ జెడ్పీటీసీ దూరు గంగన్నదొరను అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పరామర్శించారు. ఆరోగ్యంపై అడిగి తెలుసుకున్నారు. గడపగడప కార్యక్రమంలో భాగంగా లంగుపర్తి గ్రామంలోని దివంగత మాజీ ఎమ్మెల్యే దూరు సన్యాసిదొర ఇంటికి వెళ్లి, కుటుంబసభ్యులతో మాట్లాడి సంక్షేమ పథకాల అమలును అడిగి తెలుసుకున్నారు. వైస్ ఎంపీపీ దూరు జయవర్ధిని, మండల పార్టీ అధ్యక్షుడు ఆర్.స్వామి, ఎంపీటీసీలు డి.జయశ్రీ, టి.మితుల, సర్పంచులు జన్ని సన్యాసిరావు, ఎస్.సన్యాసిరావు, పెంటమ్మ, ఉపాధ్యక్షులు కె.సూర్యనారయణ, ప్రధాన కార్యదర్శి ఎస్.లక్ష్మణ్‌రావు, జేసీసీ కో–ఆర్డినేటర్ బి.గంగులు, గంగరాజు, విశ్వనాథం, రాజేష్, సతీష్ పాల్గొన్నారు.



గ్రామస్తులకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి



అరకులోయలో నగర సంకీర్తనలో భక్తులు



వీఆర్ పురంలో స్వామి వారి ఊరేగింపులో భక్తులు



ప్రత్యేకాలంకరణలో వెంకటేశ్వస్వామి

అరకులోయటౌన్/సీలేరు/అడ్డతీగల/రాజవొమ్మంగి/కూనవరం/వీఆర్ పురం: జిల్లాలో ముక్కోటి ఏకాదశి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. వేంకటేశ్వస్వామి, రామాలయాలు, రాధాకృష్ణ ఆలయాల్లో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం , లక్ష తులసీ పత్రుల పూజలు జరిపారు. వెంకటేశ్వర స్వామి, రామాలయం తదతర ఆలయాల్లోని ఉత్తర ద్వారం మీదుగా భక్తులకు స్వామి వారి ప్రత్యేక దర్శనం కల్పించారు. నగర సంకీర్తన, భజన కార్యక్రమాలు నిర్వహించారు. అన్న సమారాధన జరిగింది. సీలేరులో కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. అడ్డతీగలలోని పవనగిరి క్షేత్రంలో కొలువైన బాలాజీ స్వామి ఆలయంలో వేకువజాము నుంచే స్వామి వారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణ మహోత్సవాన్ని బ్రహ్మశ్రీ సతీష్‌శర్మ పౌరోహిత్యంలో ఘనంగా నిర్వహించారు. భక్తులకు కల్యాణ తలంబ్రాలతో పాటు అయోధ్య నుంచి తెప్పించిన అక్షింతలు, ప్రసాద వితరణ గావించారు. పవనగిరి వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య విజయలక్ష్మి దంపతులు పర్యవేక్షించారు. కూనవరంలో తెల్లవారు జాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో హాజరై శబరి, గోదావరి నదుల సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీపట్టాభి సీతారామ చంద్ర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక నిర్వహించారు. వీఆర్ పురంలో సుందర సీతారామ చంద్ర స్వామి వారిని ఊరేగించారు. ఆలయ చైర్మెన్ బాలరాజు, రామారావు, సాయిబాబా, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేకాలంకరణలో సీతారాములు



సీలేరులో పూజలు చేస్తున్న భక్తులు



అడ్డతీగలలో శ్రీనివాసుని కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

కోదండ రామాలయంలో ఏకాహం

అడ్డతీగల: ముక్కోటి ఏకాదశి సందర్భంగా శనివారం అడ్డతీగలలోని పురాతన కోదండ రామాలయంలో ఏకాహ మహోత్సవం నిర్వహించారు. తెల్లవారు 5 నుంచి ఆయా భజన మండళ్ల సభ్యులు భక్తి గీతాలాపన సాగిస్తున్నారు. ఆదివారం వేకువజామున 5.30 గంటల వరకూ చేసి అనంతరం మహో మంగళ హారతితో కార్యక్రమాన్ని ముగిస్తారు.



కూనవరంలో పూజలు చేస్తున్న భక్తులు

జోనల్ మీట్ పోటీల్లో సత్తాచాటిన గిరిజన విద్యార్థులు





ట్రోఫీ, సర్టిఫికెట్లతో రంపచోడవరం, రాజవొమ్మంగి పాఠశాలల విద్యార్థులు

రంపచోడవరం/రాజవొమ్మంగి: ఏలూరు జిల్లా జీలుగుమిల్లిలో ఇటీవల నిర్వహించిన జోనల్ మీట్‌లో రంపచోడవరం, రాజవొమ్మంగి ప్రాంతాల గురుకుల పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ ప్రదర్శించారు. ఇందులో భాగంగా రంపచోడవరం పాఠశాల నుంచి పరుగు పందెం, హైజంప్, లాంగ్ జంప్, రిలే పరుగు పందెం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు పి.చరణ్, కె.రాహుల్, అఖిల్‌కుమార్, నాగచైతన్య, ప్రవీణ్, సిద్ధార్థ, సాయితేజ తదితరులు ఉత్తమ ప్రతిభ చాటారని హెచ్‌ఎం ఎస్.కె.అహ్మద్ అలీషా తెలిపారు. రాజవొమ్మంగి పాఠశాలకు చెందిన విద్యార్థులు టెన్నికాయిట్, రన్నింగ్‌లో విజయం సాధించినట్టుప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఆయా విద్యార్థులను అభినందించారు.